క్లుప్తంగా

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం



శివాజీ కథ వివరిస్తున్న వక్తలు

కోరుట్లరూరల్: జోగిన్‌పెల్లి గ్రామంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతీ సంవత్సరం జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి రోజు ఈ వేడుక నిర్వహిస్తామని వక్తలు పేర్కొన్నారు. శివాజీ కథను వివరించారు. దుంపాల రాజనర్సయ్య, కోరుట్ల నగర శారీరక ప్రముఖ వక్త చిల్యాల శివకుమార్, శాఖ కార్యవాహ ఎలేటి స్వామిరెడ్డి, జయంత్, హర్షవర్దన్, అనిల్, రవీందర్, మండల సామాజిక సమరత అధ్యక్షుడు రాజేశ్, స్వయం సేవకులు పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని సంఘమిత్ర, శివాజీ రైతు యువజన సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం హిందూ సామ్రాజ్యవాద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం కాషాయ జెండాను ఎగరేశారు. కార్యకర్తలు వేల్పుల గంగరాజం, కుర్మ సుదర్శన్, నారాయణరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పటేల్ శివారెడ్డి, పాలడుగు అనిల్, మోహన్‌రెడ్డి, కిశోర్, జలపతిరెడ్డి, తోపారపు రవీందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రం అందిస్తున్న అధ్యక్షుడు

మెట్‌పల్లి: పదోతరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన ఆర్యవైశ్య విద్యార్థులకు ఆదివారం పట్టణంలోని వాసవీ గార్డెన్‌లో సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. 36 మంది విద్యార్థులకు జిల్లా అధ్యక్షుడు మైలారపు లింబాద్రి, పట్టణాధ్యక్షుడు రాములు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. కోట సుమన్, ఎలిమి రవి, దొంతుల లక్ష్మీనారాయణ, సంతోష్, లవ్ కుమార్ తదితరులున్నారు.

కార్యవర్గం ఎన్నిక

మెట్‌పల్లి: పాత తాలూకా ఎల్లాపి సంఘ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొడిమ్యాల వంశీధర్, కార్యదర్శిగా జాజాల రవీందర్, కోశాధికారిగా తూం శ్రవణ్‌రావును సభ్యులు ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు.

సైనిక గ్రూప్ జిల్లా ఇన్‌చార్జిగా బాలరాజు



రాయికల్: సైనిక గ్రూప్ జిల్లా ఇన్‌చార్జిగా కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన పంచాతి బాలరాజును నియమిస్తూ తెలంగాణ, ఏపీ ఫౌండర్స్ లోకేశ్, ప్రసాద్, శివకుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. నిరుద్యోగులు, నిరుపేద యువతకు సేవ చేస్తున్నందుకు గాను ఎంపిక చేశారు.

ఆరోగ్యమైన సమాజంతోనే దేశాభివృద్ధి



మల్లాపూర్‌లో ఉచిత వైద్యశిబిరం

మల్లాపూర్: ఆరోగ్యమైన సమాజంతోనే దేశాభివృద్ధి సాధ్యమని మాతృశ్రీ హాస్పిటల్ ప్రముఖ వైద్యుడు డా.రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాతృశ్రీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్యశిబిరాన్ని సహచర వైద్యురాలు భారతరాణితో కలిసి ప్రారంభించారు. ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులను అందించారు.

వేధింపులకు గురైతే ఫిర్యాదు చేయాలి



మాట్లాడుతున్న హరి అశోక్‌కుమార్

జగిత్యాల: పని చేసే చోట మహిళా ఉద్యోగులు వేధింపులకు గురైతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం కార్యాలయంలో మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ కృష్ణారెడ్డి, హన్మంతరెడ్డి, దిండిగాల విఠల్, మహిళా సంఘాల జేఏసీ నేతలు సి.మంజరి, జలజ, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

పనులకు మోక్షం ఎప్పుడో?

- బిల్లులు రాక నిలిపేసిన కాంట్రాక్టర్లు
- 9 పాఠశాలలకు రూ.2.23కోట్లు మంజూరు
- పట్టించుకోని అధికారులు, నాయకులు



గోధూర్ ప్రాథమిక పాఠశాలలో పునాదులకే పరిమితమైన అదనపు తరగతి గదుల నిర్మాణం

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు, అదనపు తరగతి గదులు నిర్మించేందుకు గత ప్రభుత్వం మన ఊరు.. మన బడి పథకం కింద రూ.కోట్ల నిధులు మంజూరు చేసింది. మండలంలోని 9 పాఠశాలలను ఎంపిక చేసి రూ.2.23కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో పాఠశాల్లో డైనింగ్ హాల్, మరమ్మతులు, అదనపు తరగతి గదులు, టాయిలెట్లు, ప్రహరీలు, వంట గదుల నిర్మాణం చేపట్టాలి. పనులు చేసేందుకు ఆర్‌అండ్‌బీ శాఖ రెండు సంవత్సరాల క్రితం టెండర్లు పిలవగా.. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు 6 నెలల్లోనే పనులు పూర్తి చేయాల్సి ఉంది. నత్తనడకన పనులు కొనసాగగా.. అరకొర పనులు చేసినా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు అర్ధాంతరంగా పనులను నిలిపేయడంతో గోధూర్, ఇబ్రహీంపట్నం పాఠశాలల్లో పునాదులకే పరిమితమయ్యాయి. 18 నెలల క్రితం కొత్త ప్రభుత్వం ఏర్పడి అమ్మ ఆదర్శ పాఠశాలలను ఎంపిక చేసి మరమ్మతు పనులు చేపట్టడంతో.. మన ఊరు.. మన బడి పథకం కింద మంజూరైన పనులను పట్టించుకునేవారే లేరని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి వారికి ఇవ్వాల్సిన బిల్లులను చెల్లించి మన ఊరు.. మన బడి కింద మంజూరైన పాఠశాలల్లో వెంటనే అదనపు తరగతి గదులు, అభివృద్ధి పనులను పూర్తి చేయించాలని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

పునాదులకే పరిమితం

మన ఊరు.. మన బడి పథకం కింద మండలంలోని 9 పాఠశాలలు ఎంపిక కాగా.. గోధూర్ ప్రాథమిక పాఠశాలకు రూ.23.9లక్షలు మంజూరయ్యాయి. డైనింగ్ హాల్, 2 అదనపు తరగతి గదులు, టాయిలెట్లు, కిచెన్ షెడ్ పునాదులకే పరిమితమయ్యాయి. వర్షకొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణం పూర్తి కాగా.. 2 అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభించలేదు. ప్రాథమిక పాఠశాలలో టాయిలెట్ల పనులు పూర్తి కాలేదు. ఇబ్రహీంపట్నం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.36లక్షలు మంజూరు కాగా.. డైనింగ్ హాల్ నిర్మాణం పునాదులకే పరిమితమైంది. టాయిలెట్లు, ప్రహరీ పనులు ప్రారంభించలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులను పూర్తి చేయించి విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయించాలి



ఇబ్రహీంపట్నం హైస్కూల్‌కు రూ.36లక్షలు మంజూరయ్యాయి. డైనింగ్ హాల్ నిర్మాణ పనులు పునాదుల వరకే నిర్మించారు. టాయిలెట్లు నిర్మించకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాలల్లో 250 మంది విద్యార్థులు చదువుతున్నారు. అదనపు తరగతి గదులు నిర్మించాలి. వెంటనే అధికారులు చొరవ చూపి కాంట్రాక్టర్‌తో పనులు చేయించాలి.

– రాజన్న, హైస్కూల్ హెచ్‌ఎం, ఇబ్రహీంపట్నం

ఇబ్బంది పడుతున్నాం



మన ఊరు.. మన బడి పథకం కింద మంజూరైన పనులు కాంట్రాక్టర్లు నిలిపేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. గోధూర్ పాఠశాలకు నిధులు మంజూరయ్యాయి. కాని అదనపు తరగతి గదుల నిర్మాణం పనులు పునాదుల వరకే నిర్మించారు. టాయిలెట్లు, కిచెన్ షెడ్ లేక ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే ఆగిపోయిన పనులను పూర్తి చేయించాలి.

– మధు, ఇన్‌చార్జి ఎంఈవో, ఇబ్రహీంపట్నం

గ్రామాల్లో బడిబాట



చింతకుంటలో విద్యార్థి ఇంటి వద్ద ఉపాధ్యాయులు

కథలాపూర్: చింతకుంట, భూషణరావుపేట, పోసానిపేట గ్రామాల్లో ఆదివారం ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల ఇళ్ల వద్దకెళ్లి కొత్త ప్రవేశాలు తీసుకున్నారు. హెచ్‌ఎంలు సుధాకర్, జగన్, రవికుమార్, వేణుశర్మ పాల్గొన్నారు.

మల్లాపూర్: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లోనే చేర్పించాలని ఎంఈవో కేతిరి దామోదర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఇంటింటికెళ్లి బడిబాట ప్రచారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

చేపల విక్రయాల జోరు



కథలాపూర్‌లో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

కథలాపూర్: ఆదివారం మృగశిర కార్తె కావడంతో మండలంలోని గ్రామాల్లో చేపల విక్రయాలు జోరుగా సాగాయి. మృగశిర కార్తె రోజున చేపల కూర తింటే ఆరోగ్యంగా ఉంటారనే నమ్మకంతో ప్రజలు చేపలు కొనేందుకు బారులు తీరారు. చేపల కూర తినాలనే ఉద్దేశంతో అధిక ధరలు వెచ్చించి ప్రజలు కొనుగోలు చేశారు. గ్రామాల్లో కిలోకు రూ.250 నుంచి రూ.300 వరకు చొప్పున చేపలు విక్రయించారు.

నిరుపేదకు ఆర్థిక సాయం



జగిత్యాలరూరల్: మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన నిరుపేద యువకుడు ముత్యపు అభిలాష్ ఇటీవల రైలులో ప్రయాణం చేస్తూ మంచిర్యాలలో దిగుతుండగా ఫిట్స్ వచ్చి ప్లాట్‌ఫామ్‌పై పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. జగిత్యాల స్పెషల్ బ్రాంచ్‌లో పని చేస్తున్న ఏఎస్సై, జిల్లా అవోపా అధ్యక్షుడు రాజేశుని శ్రీనివాస్ ఆదివారం వాసవి సేవాదళ్‌తోపాటు మూడు సోషల్ మీడియా గ్రూపుల ద్వారా రూ.63,639 సాయమందగా.. బాధితుడి తమ్ముడు అజయ్‌కుమార్‌కు ఆదివారం అందజేశారు.

పాఠశాలకు స్మార్ట్ టీవీ బహూకరణ



సారంగాపూర్: నాగునూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన చీటి శ్రీనివాస్‌రావు రూ.15వేల విలువ చేసే స్మార్ట్ టీవీని ఆదివారం బహూకరించాడు. బడిబాట కార్యక్రమంలో విద్యార్థులను బడిలో చేర్పించడానికి ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటా తిరిగి ప్రచారం నిర్వహిస్తున్నారు. దృశ్య శ్రవణ మాధ్యమంలో బోధనాభ్యాసం చేపట్టామని, ఇందుకు టీవీ అవసరమని ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావుకు సూచించడంతో.. తన తండ్రి చీటి ప్రభాకర్‌రావు జ్ఞాపకార్థం స్మార్ట్ టీవీని అందించాడు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభించాలి



భూమిపూజలో పాల్గొన్న కృష్ణారావు

కోరుట్ల రూరల్: ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన పనులు ప్రారంభించుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. పైడిమడుగు, చిన్నమెట్‌పల్లి, కోరుట్ల మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్ గ్రామాల్లో పనులు ప్రారంభ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వెంకటాపూర్‌లో పలువురు లబ్ధిదారులు పనులు ప్రారంభించగా.. కాంగ్రెస్ నాయకులు పాల్గొని భూమిపూజ చేశారు. ఏఎంసీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, వేంకటేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎతిరాజం నర్సయ్య, నాయకులు సత్యనారాయణగౌడ్, ఆశిరెడ్డి రాజేశం, కాశిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, వెంకటి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రావుపల్లెలో వెలగని వీధి దీపాలు



అంధకారంలో వీధులు

కోరుట్ల రూరల్: అయిలాపూర్ అనుబంధ గ్రామమైన కిషన్‌రావుపల్లెలో వారం రోజులుగా వీది దీపాలు వెలగడం లేదని గ్రామస్తులు ఆదివారం తెలిపారు. రాత్రివేళ అంధకారం నెలకొంటోందని వాపోతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, రాత్రివేళల్లో ఇళ్ల నుంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్నామన్నారు. అధికారులు వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేట్టాలని కోరుతున్నారు.



రాయికల్‌లో వివేకవర్ధిని పూర్వ విద్యార్థులు



పొరండ్ల పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాయికల్: పట్టణంలోని వివేకవర్ధిని ఉన్నత పాఠశాలలో 2003–04 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా కలిసి ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉపాధ్యాయులను సన్మానించారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సరదాగా గడిపారు. ప్రిన్సిపాల్ కైరం సత్యంగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయికల్ పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 2009–10 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థినులు పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయులు జమునదేవి, గుండేటి తరంగిణి, వెంకటలక్ష్మి, శ్రీలత, డేసిరాణి, లక్ష్మి, ఉమ, అరుణ పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: పొరండ్ల జిల్లాపరిషత్ పాఠశాలలో 2012–13లో పదోతరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం జిల్లాపరిషత్ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉపాధ్యాయులను సన్మానించారు. స్వీట్లు పంపిణీ చేశారు.

జగిత్యాల: ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1997–2000లో డిగ్రీ పూర్తి చేసిన బీకాం విద్యార్థులు సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. 25 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వీరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. అప్పటి అధ్యాపకులను ఘనంగా సత్కరించారు.



ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల పూర్వ విద్యార్థులు



రాయికల్ జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థినులు



మెట్‌పల్లిరూరల్: జగ్గాసాగర్–కొండ్రికర్ల రహదారి అధ్వానంగా మారింది. రాళ్లు, రప్పలు తేలడంతోపాటు గుంతలు పడ్డ రహదారిపై ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి నిర్మాణ పనులకు పంచాయతీరాజ్ నుంచి రూ.40లక్షలు నిధులు మంజూరయ్యాయి. అయినా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
అన్వర్, పంచాయతీరాజ్ ఏఈ, మెట్‌పల్లి, సెల్ నంబర్: 9963468402

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ట్రాఫిక్ క్లియర్

సాక్షి స్పందన



జగిత్యాల: కొత్త బస్టాండ్‌లో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉందని సాక్షిలో ఆదివారం ప్రచురితమవగా.. ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన స్పందించారు. బస్సులు ఆగేచోట వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నూతన మంత్రుల ప్రమాణ స్వీకారంపై హర్షం



కోరుట్ల: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

కోరుట్ల: రాష్ట్ర నూతన మంత్రులుగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి ఆదివారం ప్రమాణ స్వీకారం చేయగా.. ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. టపాకాయలు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్ మోర్తాడ్ లక్ష్మీనారాయణ, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు శనిగారపు రాజేశ్, నాయకులు ఎర్ర శంకర్, చిల్యాల లచ్చయ్య, కిరణ్, మహేందర్, హరీశ్, మోర్తాడ్ రాజశేఖర్, రాజు ఎమ్మార్పీఎస్, మాదిగ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పెగడపల్లి: రాష్ట్ర మంత్రిగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేసిన ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను పెగడపల్లి మండల కాంగ్రెస్ శ్రేణులు మర్యాదపూర్వకంగా హైదరాబాద్‌లో కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ రాములుగౌడ్, నాయకులు రవినాయక్, మల్లారెడ్డి, కిషన్, తిరుపతి, మహేందర్, రాజు, విజయభాస్కర్, శ్రీనివాస్, అనిల్‌గౌడ్, స్వామి తదితరులున్నారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల్లోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

ధర్మపురి: ధర్మపురితోపాటు మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు జరిపారు. స్థానిక నంది కూడలి వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. నేరెల్ల గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు ఎస్.దినేశ్, వేముల రాజు, దేవస్థానం చైర్మన్ జక్కు రవీందర్, జాజాల రమేశ్, కాసారపు బాలాగౌడ్ తదితరులున్నారు.

జగిత్యాల: రాష్ట్ర మంత్రివర్గంలో బీసీ, ఎస్సీ సామాజికవర్గాలకు సముచిత స్థానం కల్పించడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ అన్నారు. నాయకులు గంగాధర్, రాంచంద్రం, రోజా పాల్గొన్నారు.

రాయికల్: మండల, పట్టణ కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్ తరలివెళ్లి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు తంగెళ్ల రమేశ్, నాయకుడు అత్తినేని గంగారెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, ఎంబరి వెంకటేశ్, బర్కం కృష్ణమూర్తి, పునుగోటి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.



బోనాల ఉత్సవాల్లో చొప్పదండి ఎమ్మెల్యే

మల్యాల: నూకపల్లి గ్రామంలోని ముదిరాజ్ కులస్తుల బోనాల ఉత్సవాల్లో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొని బోనం ఎత్తుకున్నారు. డప్పుచప్పుళ్ల మధ్య వందలాది మంది బోనాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు ఎమ్మెల్యే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కథలాపూర్: సిరికొండ గ్రామంలో పెద్దమ్మ తల్లి బోనాల జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెద్దమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పోచమ్మ బోనాలు



రాయికల్: భూపతిపూర్ గ్రామంలో పద్మశాలీ సేవాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ తల్లికి మహిళలు బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. నాయకులు జక్కుల చంద్రశేఖర్, కటకం సతీశ్, భోగ సత్తయ్య, వెంకట్ వెంకటాద్రి, మహేశ్, సాగర్, గంగాధర్, పృథ్వీ, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలకనుగుణంగా నడుచుకోవాలి

జగిత్యాల: అంబేడ్కర్ ఆశయాలకనుగుణంగా నడుచుకోవాలని రిటైర్డ్ ఆర్మీ అధికారి ప్రకాశ్ అన్నారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ స్మరణం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.